నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
8 | గురువారం 27 ఫిబ్రవరి 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD



మంచిర్యాల జిల్లా కలెక్టరేట్‌లో పోలింగ్ సామగ్రిని పంపిణీ చేస్తున్న అధికారులు




ఆసిఫాబాద్‌లో ఎన్నికల సామగ్రిని పోలింగ్ కేంద్రాలకు తరలిస్తున్న సిబ్బంది

# నేడే ఎమ్మెల్సీ సమరం



ఎన్నికల సామగ్రితో విధులకు వెళ్తున్న ఉద్యోగిని




## రెండు స్థానాల ఎన్నికలకు సర్వం సిద్ధం

- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా పూర్తయిన ఏర్పాట్లు
- ఎన్నికల సామగ్రితో కేంద్రాలకు తరలివెళ్లిన అధికారులు
- పైసలు గుప్పించిన ప్రధాన పార్టీల అభ్యర్థులు

**ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్**

**ఉమ్మడి జిల్లాలో 67,738 మంది పట్టాభద్రులు, 5,512 మంది ఉపాధ్యాయ ఓటర్లు**

మంచిర్యాల, ఫిబ్రవరి 26(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : తెలంగాణలో రెండు ఉపాధ్యాయ, ఒక పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు నేడు(గురువారం) ఎన్నికలు జరగనున్నాయి. వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ స్థానంతోపాటు మెదక్- నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ ఉపాధ్యాయ, పట్టభద్రుల స్థానాలకు పోలింగ్ నిర్వహించేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. కాగా.. ఎన్నికల్లో గెలిచేందుకు ప్రధాన రాజకీయ పార్టీలు ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నాయి. మంగళవారం సాయంత్రం 5 గంటలకు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార పర్వం ముగిసింది. దీంతో పోటీలో ఉన్న అభ్యర్థులు ఓటర్లను ప్రలోభపెట్టే పనిలో నిమగ్నమయ్యారు. ఎన్నికలకు ముందు రోజు శివరాత్రి రావడం వారికి కలిసొచ్చింది. బుధవారం రాత్రి మొదలుకుని గురువారం ఉదయానికి ఓటర్లందరినీ చేరుకునేలా వ్యూహాలతో ముందుకు వెళ్తున్నారు. ఓ ప్రధాన జాతీయ పార్టీకి చెందిన అభ్యర్థి రెండు రోజుల ముందే ఓటర్లకు డబ్బులు వచ్చాయి. ఓటకు రూ.2 వేల నుంచి రూ.3 వేల దాకా ముట్టజెప్పారని ఓటర్లు చెప్తున్నారు. ఇక రాష్ట్రంలో అధికారంలో ఉన్న మరో జాతీయ పార్టీకి చెందిన అభ్యర్థి కూడా భారీగా పైసలు గుప్పిస్తున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇక టీచర్ ఎమ్మెల్సీ బరిలో ఉన్న ఓ జాతీయ పార్టీ అభ్యర్థి టీచర్లకు ఏకంగా ఓటుకు రూ.5 వేల చొప్పున ముట్టజెప్పినట్లు తెలిసింది. రాష్ట్ర అధికార పార్టీ సపోర్ట్ ఉన్న అభ్యర్థి టీచర్లకు ఓటుకు రూ.2వేల చొప్పున ఇచ్చినట్లు సమాచారం. చదువుకున్న పట్టభద్రులు, టీచర్లు మాత్రం డబ్బులు తీసుకుని ఎవరికి ఓటు వేయాలో వారికి వేసేందుకు సిద్ధం అవుతున్నారు.

### ఉమ్మడి జిల్లాలో 74,827 ఓటర్లు

మెదక్- నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ పట్టభద్రుల స్థానం నుంచి టి.జీవన్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా రఘోత్తంరెడ్డిల పదవీకాలం మార్చి 29వ తేదీన ముగియనుంది. ఈ నేపథ్యంలో ఈ స్థానాల్లో ఎన్నికల నిర్వహణకు ఈ నెల 3వ తేదీన ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. పట్టభద్రుల ఎమ్మెల్సీ కోసం 54 మంది, టీచర్ ఎమ్మెల్సీ కోసం 16 మంది బరిలో నిలిచారు. గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల దాకా పోలింగ్ జరగనుంది. ఇందుకోసం అన్ని జిల్లాల కలెక్టర్ల ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. బుధవారం సాయంత్రం జిల్లా కేంద్రాల నుంచి ఎన్నికల సామగ్రి, బ్యాలెట్ బాక్సులతో అధికారులకు పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 69,134 పట్టభద్రుల ఓటర్లు, 5,693 ఉపాధ్యాయ ఓటర్లు మొత్తం 74,827 మంది ఓటర్లు ఈ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

అత్యధికంగా మంచిర్యాల జిల్లాలో 32,585 మంది ఓటర్లు ఉన్నారు. పట్టభద్రుల ఓటర్ల కోసం 40, ఉపాధ్యాయ ఓటర్ల కోసం 18 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పోలింగ్ ఆఫీసర్లు 60, అసిస్టెంట్ పోలింగ్ అధికారులు 181, మైక్రో అబ్జర్వర్లు 25, రూట్ ఆఫీసర్లు 12 మంది మొత్తం 229 మంది అధికారులు ఎన్నికల విధుల్లో పాల్గొననున్నారు.

ఆసిఫాబాద్ జిల్లాలో 6,607 మంది ఓటర్లు ఉండగా 17 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రత్యేకించి పట్టభద్రుల కోసం రెండు, టీచర్ల కోసం ఒక పోలింగ్ కేంద్రం కేటాయించారు. మిగిలిన 14 పోలింగ్ స్టేషన్లు కామన్ పోలింగ్ స్టేషన్‌లుగా ఏర్పాట్లు చేశారు. పోలింగ్ ఆఫీసర్లు 19, అసిస్టెంట్ పోలింగ్ అధికారులు 87, మైక్రో అబ్జర్వర్లు 17 మందిని నియమించారు.

ఆదిలాబాద్ జిల్లాలో 16,528 మంది ఓటర్లు ఉండగా 39 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పోలింగ్ ఆఫీసర్లు 46, అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్లు 153, మైక్రో అబ్జర్వర్లు 28, జోనల్ ఆఫీసర్లు 9 మంది ఎన్నికల విధుల్లో పాల్గొననున్నారు.

నిర్మల్ జిల్లాలో 19,107 ఓటర్లు ఉండగా 46 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పోలింగ్ ఆఫీసర్లు 37, అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్లు 148, మైక్రో అబ్జర్వర్లు 26 మంది ఎన్నికల విధుల్లో పాల్గొననున్నారు.



ఆసిఫాబాద్‌లో ఎన్నికల సామగ్రిని పంపిణీ చేస్తున్న అధికారులు

## పోలింగ్ కేంద్రాలకు తరలిన సిబ్బంది

కుమ్రం భీం ఆసిఫాబాద్/ ఆసిఫాబాద్ టౌన్,ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ): ఆసిఫాబాద్‌లోని కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామగ్రిని ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. అనంతరం పోలింగ్ కేంద్రాలకు వెళ్లే సిబ్బంది వాహనాలను అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డెవిడ్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, ఆర్డీవో లోకేశ్వర్ రావుతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసిన కార్యాలయాలు/సంస్థలకు ఈ నెల 27న పోలింగ్ రోజు వేతనంతో కూడిన సెలవు, ఈ నెల 27న జిల్లాలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసిన ప్రభుత్వ పాఠశాలలు/సంస్థలకు సెలవు ప్రకటించినట్లు తెలిపారు. 48 గంటల ముందు నుంచే జిల్లాలో మద్యం అమ్మకాలను నిలిపివేయడంతో పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నారు.



ఆసిఫాబాద్‌లో పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న సిబ్బంది వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

## ఎన్నికల సామగ్రి పంపిణీని పరిశీలించిన కలెక్టర్

నస్పూర్, ఫిబ్రవరి 26 : ఎమ్మెల్సీ ఎన్నికలకు పోలింగ్ సామగ్రి పంపిణీ ప్రక్రియను మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ పరిశీలించారు. బుధవారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామగ్రి పంపిణీ ప్రక్రియను మంచిర్యాల అదనపు కలెక్టర్ మోతీలాల్, ఆర్డీవోలు శ్రీనివాస్‌రావుతో కలిసి పర్యవేక్షించారు. ఎన్నికలకు పూర్తి ఏర్పాట్లు చేశామని, సజావుగా సాగేలా అందరూ సహకరించాలన్నారు.

నస్పూర్‌లో ఎన్నికల సామగ్రి పంపిణీని పరిశీలిస్తున్న మంచిర్యాల కలెక్టర్‌కుమార్ దీపక్








సీజ్ చేసిన మద్యాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ రామానుజం, పోలీసు అధికారులు

## అక్రమ మద్యం నిల్వలపై పోలీసుల దాడులు

### రూ. 21 లక్షల విలువైన లిక్కర్ సీజ్

చింతలమానేపల్లి, ఫిబ్రవరి 26 : వైన్ షాపులకు సీల్ వేసిన తర్వాత ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా అక్రమంగా నిల్వ ఉంచిన రూ.21లక్షల విలువైన మద్యాన్ని మంగళవారం రాత్రి పోలీసులు పట్టుకుని సీజ్ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం బుధవారం చింతలమానేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో వెల్లడించారు. వైన్‌షాప్‌లకు సీల్ వేసిన తర్వాత మద్యం విక్రయిస్తున్నట్లు జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావుకి సమాచారం అందింది. ఎస్పీ ఆదేశాల మేరకు కౌటాల సీఐ ముత్యం రమేశ్, ఎస్ఐలు ప్రవీణ్ కుమార్, మధుకర్, నరేశ్ చింతలమానేపల్లి మండలం గూడెం గ్రామ సమీపంలోని వైన్ షాప్ దగ్గర తనిఖీలు చేశారు. వైన్ షాపు పక్కనే ఉన్న రూములో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం కార్టన్లు గుర్తించారు. అనంతరం గ్రామంలో మూడు బెల్ట్ షాపులను తనిఖీ చేయగా అక్కడ కూడా మద్యం బాటిళ్లు దొరికాయి. ఈ తనిఖీల్లో మొత్తం 700 కార్టన్ల మద్యం సీసాలు, బీరు సీసాలు పట్టుబడగా వాటి విలువ రూ. 21,50,890 ఉంటుందని చెప్పారు. వీటిని పంచనామా నిర్వహించి పోలీస్‌స్టేషన్‌కి తరలించి ఎక్సైజ్ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. నలుగురిపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. ఎన్నికల నియమావళి ప్రకారం ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని లేదంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో పాల్గొన్న సీఐ ముత్యం రమేశ్, ఎస్ఐలు, సిబ్బందిని ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు, డీఎస్పీ రామానుజం అభినందించారు.

## నీలకంఠుడికి నీరాజనం

**శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు**

*మంచిర్యాల జిల్లాలో మహాశివరాత్రి వేడుకలు బుధవారం వైభవంగా జరిగాయి. శైవక్షేత్రాలన్నీ శివనామస్మరణతో మార్మోగాయి. జిల్లా కేంద్రంతో పాటు గూడెం లక్షెట్టిపేట, చెన్నూర్, దండేపల్లిలో గోదావరి నదీ తీరాల్లో భక్తులు పుణ్యస్నానాలు చేశారు. సమీపంలోని ఆలయాల్లో లింగేశ్వరుడిని దర్శించుకొని అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. వేలాల మల్లికార్జున స్వామి ఆలయం, కత్తెరశాల మల్లన్న, బుగ్గ రాజరాజేశ్వరస్వామి, మంచిర్యాలలో విశ్వనాథాలయం, గూడెంలో శివాలయాలు, తదితర ఆలయాల వద్ద జరిగిన జాతరలు భక్తులతో సందడిగా మారాయి.*

*- నమస్తే నెట్‌వర్క్, ఫిబ్రవరి 26*



మంచిర్యాలలోని విశ్వనాథ ఆలయంలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, కుటుంబ సభ్యులు



ఆసిఫాబాద్‌లో సందీప్‌నగర్ శివాలయంలో పట్టు వస్త్రాలు సమర్పించేందుకు వెళ్తున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి దంపతులు